కామెడీ కథ

# సెల్లుక్కొట్టు...

**మాట్లాడి చాలా కాలమైందని మిత్రుడు రంగారావుకు ఆఫీసు నుంచి ఫోన్ చేశాడు పీతాంబరం.**

**కుశల ప్రశ్నలయ్యాక రెండు మాటలు మాట్లాడి "సెల్లుక్కొట్టు" అన్నాడు రంగారావు.**

**"ఏం కొట్టు" అర్థంకాక అడిగాడు పీతాంబరం. కానీ అప్పటికే ఫోన్ పెట్టేశాడు రంగారావు.**

"సెల్లుక్కొట్టు.." పీతాంబరం చిన్నబుర్రకి ఆ మాటకి అర్థం ఎంతకీ తెలియలేదు. అటూ ఇటూ చూసి అలవాటు ప్రకారం పక్కసీట్లో కొత్తగా చేరిన కుర్ర టైపిస్ట్‌ని అడిగాడు.

ఆమె మొదట పకపకా నవ్వింది.

అంతలోనే నవ్వడం సగంలోనే ఆపేసి చెప్పింది (ఏ పనైనా సగంలో ఆపెయ్యడం ఆమె ఆ గవర్నమెంటు ఆఫీసులో చేరాక కొత్తగా నేర్చుకుంది!)

"సెల్లుక్కొట్టు అంటే సెల్‌కి ఫోన్ చెయ్యమని...ఈమధ్యన సెల్‌ఫోన్స్ ఎంత పాపులర్ అయ్యాయో ఈ సెల్లుక్కొట్టు అన్నమాట కూడా అంత పాపులరైపోయింది... మీరెక్కడున్నారండీ బాబూ..." అంటూ అలవాటు ప్రకారం తన మాటల్ని సగంలోనే ఆపేసింది.

పీతాంబరం గతుక్కుమన్నాడు. అంత చిన్న మాట కూడా అర్థం కానందుకు తనని తనే తిట్టుకున్నాడు.

"ఎంతసేపూ, ఆఫీసు ఫైళ్లనే కాకుండా కాస్త బయటి ప్రపంచాన్ని కూడా గమనించండి" నవ్వుతూ అందామె అప్పుడే మోగిన తన సెల్‌ఫోన్‌ని స్టైల్‌గా బ్యాగ్‌లోంచి బయటకి తీస్తూ.

పీతాంబరానికి ఆఫీసు ఫైళ్లని మూసేసి వెంటనే కారిడార్లోకి నడిచివెళ్లిపోయి ఒకసారి 'బయటి ప్రపంచాన్ని' చూసొద్దామన్నంత గాఢమైన కోరిక కలిగిందిగానీ తమాయించుకున్నాడు.

తను కూడా సాధ్యమైనంత తొందర్లో ఆఫీస్‌కి స్టైల్‌గా సెల్‌ఫోన్ పట్టుకొచ్చి ఈ పిల్ల పొగరణచాలి అని మనసులోనే గట్టిగా శపథం చేసుకున్నాడు.

★ ★ ★

సెల్‌ఫోన్ కొనాలన్న కోరికకి పీతాంబరం మనసులో బీజం ఆ విధంగా పడితే దాన్ని అంకురింపచేసి, పెంచి పోషించే బాధ్యత అతని భార్య వెంకటలక్ష్మి, పిల్లలూ తీసుకున్నారు.

ఆ ఆదివారం నాడు పీతాంబరం ఇంట్లో ఇంటిల్లిపాదీ కూర్చుని తమ అభిమాన ప్రైవేట్ చానెల్‌లో 'మీ మాటా-మా ఆటా పాటా' కార్యక్రమం చూస్తున్నారు.

కొత్తగా రిలీజ్ అయిన సినిమాలో హీరో తన సినిమా గురించి మహిళల్లో ఫోన్‌లో ముచ్చటించే లైవ్ ప్రోగ్రాం అది.

ఫోన్ చేసే ఆడాళ్లంతా ఆ హీరోతో మాట్లాడ్డానికి లైన్ దొరకడమే తమ అదృష్టమన్నట్లు మెలికలు తిరిగిపోతున్నారు.

ఆ హీరో తెలివిగా ఆ మాట్లాడే వాళ్లందరి చేతా తన సినిమా వంద రోజులాడే వరకూ ప్రతీరోజూ మార్నింగ్‌షోకి వెళ్లేలా కమిట్ చేయిస్తున్నాడు.

వెంకటలక్ష్మి కూడా ఒకపక్క టీవీ చూస్తూనే మరోపక్క ఫోన్ ఒళ్లో పెట్టుకుని లైన్ కోసం ప్రయత్నిస్తోంది.

అంతలోనే కార్యక్రమం ఆగిపోయి, అడ్వర్టయిజ్‌మెంట్ వచ్చింది.

అదో సెల్‌ఫోన్ కంపెనీ అడ్వర్టయిజ్‌మెంటు.

సచిన్ టెండూల్కర్‌కి తన చిన్ననాటి ఫ్రెండ్స్‌తో ఆడుకుందామనిపించి వాళ్లని సెల్‌ఫోన్‌లో పిలిస్తే వాళ్లంతా క్షణాల్లో వచ్చేసి వర్షంలో తడుస్తూ ఫుట్‌బాల్ ఆడుకుంటారు.

ఆ యాడ్ చూడగానే పీతాంబరానికి సెల్‌ఫోన్ కొని టైపిస్టు నోరు మూయించాలన్న తన శపథం గుర్తొచ్చింది.

"ఎంతయినా సెల్‌ఫోన్ సెల్‌ఫోనే...అంతకు ముందు మామూలు ఫోనులో ఎన్నిసార్లు పిలిచినా రాని సచిన్ ఫ్రెండ్స్ సెల్‌ఫోన్‌లో ఒక్కసారి చెప్పగానే రెక్కలు కట్టుకొచ్చి వాలిపోయారు..." అనుకున్నాడు పీతాంబరం అమాయకంగా.

వెనువెంటనే భార్యనీ, పిల్లల్నీ కూర్చోపెట్టి తను సెల్‌ఫోన్ కొనాలని నిర్ణయించుకున్న విషయం, దాని వెనుకున్న ఆఫీస్‌లో జరిగిన సంగతులు అన్నీ చెప్పాడు.

పీతాంబరం మాట వినగానే వెంకటలక్ష్మి, పిల్లలూ ఎగిరి గంతేశారు.

"ఇక నుంచీ నేను టీవీ ప్రోగ్రాంలకి రెండు ఫోన్ల నుంచి లైను ట్రై చేసుకోవచ్చన్న మాట" మురిపెంగా అంది వెంకటలక్ష్మి.

"నాన్నా హచ్...హచ్.." ఆత్రంగా అన్నాడు పీతాంబరం పెద్ద కొడుకు.

"ఛీ వెధవా...శుభమాని సెల్‌ఫోన్ కొందామంటే తుమ్ముతావేంట్రా" అన్నాడు పీతాంబరం విసుగ్గా.

"వాడేం తుమ్మడం లేదు...హచ్ కంపెనీ కనెక్షన్ తీసుకుందాం అంటున్నాడు. మీ టైపిస్టు మిమ్మల్నిలా అన్నదంటే...ఊరికే అంటుందా" తను కూడా విసుక్కుంటూ అంది వెంకటలక్ష్మి.

"సర్లె...సర్లె... ముందరా సెల్‌ఫోన్ సంగతి చూద్దాం" అన్నాడు పీతాంబరం. అందరూ కల్సి రెండు రోజులు పేపర్లన్నీ తిరగేసి వాటిల్లో ఉన్న సెల్‌ఫోన్ కంపెనీల అడ్వర్టయిజ్‌మెంట్లన్నీ ఒక దగ్గర పెట్టి లాభనష్టాలు బేరీజు వేసుకున్నాక ఒక కంపెనీకి ఫోన్ చేశారు.

వెంకటలక్ష్మి ఫోన్‌లో చెప్పింది విన్న ఆ కంపెనీ రిసెప్షనిస్టు-

"థాంక్యూ ఫర్ కాలింగ్..మా ఏజెంట్ ఇప్పుడే మీ ఇంటికొస్తాడు. మీ సెల్ నెంబరుంటే ఇస్తారా?" అంది.

వెంకటలక్ష్మి తెల్లబోయి "అదే ఉంటే మీకెందుకు ఫోన్ చేస్తాం?" అంది.

దానికా రిసెప్షనిస్టు గలగలా నవ్వేసింది. "ఇది హైటెక్ యుగం మేడమ్. ఇంట్లో ప్రతి వాళ్లకీ ఒక సెల్ ఫోను ఉంటే కానీ రోజు గడవడం లేదు. మీరెక్కడున్నారో అర్థం కావడం లేదు. సరే..మీ అడ్రస్ చెప్పండి... కనీసం ల్యాండ్ ఫోనైనా ఉందా మీ ఇంట్లో?" అంది నవ్వుతూనే.

వెంకటలక్ష్మికి తల తీసేసినట్లయింది...ఆమె మాటలకి.


ఫోన్ పెట్టేశాక ఆలోచిస్తే ఆమెకి ఆ రిసెప్షనిస్టు అన్న మాటల్లో కూడా నిజం లేకపోలేదు అనిపించింది.

రోజూ తను ఎంతో ఇష్టంగా చూసే 'సవతుల సంగ్రామం' టీవీ సీరియల్లో చిన్నా, పెద్దా, ఆడా, మగా అన్న తేడా లేకుండా కుటుంబంలో అందరూ తలొక సెల్‌ఫోన్ పట్టుకుని గంటల తరబడి వాటిల్లో డైలాగులు చెప్పడం లేదూ?

అది చూసి కూడా తను తెలుసుకోలేకపోయింది...అనవసరంగా రిసెప్షనిస్టు దగ్గర నోరు జారింది.

'అయిందేదో అయిపోయింది...ఇప్పుడు మొగుడితో పాటూ తను కూడా ఒక సెల్‌ఫోన్ తీసేసుకుంటే సరి...' అని ఆ క్షణంలోనే ఒక నిర్ణయానికి వచ్చేసింది వెంకటలక్ష్మి. వెంటనే పీతాంబరంతో "ఏవండీ...నేను కూడా ఒక సెల్‌ఫోన్ తీసుకుంటానండీ" అంది గారంగా.

ఆకునూరి మురళీకృష్ణ



"నీ మొహం... నీకెందుకూ సెల్‌ఫోనూ?" అన్నాడు పీతాంబరం.

ఆ ప్రశ్నకి సమాధానం వెంకటలక్ష్మి చెప్పలేదు. ఆ రోజు సాయంత్రం వాళ్లింటికి వచ్చిన సెల్‌ఫోన్ కంపెనీ మార్కెటింగ్ ఏజెంట్ చెప్పాడు.

"భలే వారే...అసలావిడకొచ్చిన ఆలోచన్ని మెచ్చుకోవాలి మీరు.. ఇద్దరికీ సెల్‌ఫోన్లుంటే ఎంతో సమయం, డబ్బు కలిసొస్తుంది మీకు. ఫరెగ్జాంపుల్...మీరు ఆఫీసెకెళ్లిపోయాక మీ ఆవిడగారు సాయంత్రం షాపింగ్‌కో, సినిమాకో ప్రోగ్రాం వేశారనుకోండి... వెంటనే ఆవిడెక్కడున్నా సెల్ లోంచి మీ సెల్‌కి ఫోన్ చేసి ప్రోగ్రాం చెప్పేస్తే మీరు డైరెక్ట్‌గా అక్కడికొచ్చేయచ్చు. ఇద్దరి దగ్గరా సెల్ ఉంటుంది. కాబట్టి మిస్ అయ్యే చాన్స్ ఉండదు. పైగా సెల్ నుంచి సెల్‌కి కాల్ చేస్తే చవక...ఇన్‌స్ట్రుమెంట్ కాస్ట్ ఎలాగూ కంపెనీ భరిస్తుంది" అన్నాడతను వెంకటలక్ష్మి వంక మెచ్చుకోలుగా చూస్తూ.

అతని మాటలకి తనకి ఆర్థికశాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చినట్లుగా మురిసిపోయింది వెంకటలక్ష్మి.

"సరే...ఎలాగోలా ఏడవండి" అన్నాడు పీతాంబరం భార్యతో.

వెంకటలక్ష్మి, పిల్లలూ రెండు గంటలు అతనితో డిస్కస్ చేసి చివరికి అతను సూచించిన ఇన్‌స్ట్రుమెంటూ, అతను చెప్పిన టారిఫ్‌లో ఉన్న ప్లాన్‌తోనూ రెండు కనెక్షన్లు తీసుకుని, ఒక సెల్‌ఫోన్ పీతాంబరం చేతిలో పెట్టారు.

* * *

ఆ రోజు నుంచీ పీతాంబరం లైఫ్‌స్టైలే మారిపోయింది.

మెళ్లో మూర్ఛబిళ్ల వేసుకున్నట్లుగా సెల్‌ఫోన్ తగిలించుకోకుండా బయటికి వెళ్లడం లేదు.

ఆఫీస్‌లో అందరి ముందూ సెల్‌ఫోన్ "కుయ్...కుయ్" మంటుంటే అదోరకం ఆనంద పారవశ్యంతో మునిగిపోతున్నాడు. అందరి దృష్టీ తన మీదకి వచ్చేక కానీ ఫోన్ తీసి మాట్లాడడం లేదు.

ఎవరైనా ఆఫీసు నెంబర్‌కి ఫోన్ చేస్తే తను కూడా స్టైల్‌గా "సెల్లుక్కొట్టు..." అంటున్నాడు.

అడిగిన వాళ్లకి అడగని వాళ్లకీ అదే పనిగా ఫోన్లు చేసి తన సెల్ నెంబరు చెబుతున్నాడు.

ఆఫీసులోనూ, బస్టాపులోనూ, షాపింగ్‌లోనూ, ఎక్కడపడితే అక్కడ నించునీ, కూర్చునీ, నడుస్తూ, చెవి దగ్గర సెల్‌ఫోన్ పెట్టుకుని మాట్లాడుతుంటే, అందరూ తనని గొప్పగా చూస్తుంటే, పీతాంబరానికి ఈ లోకంలో ఉన్నట్లుగా లేదు... గంధర్వ లోకంలో విహరిస్తున్నట్లుగా ఉంది.

* * *

అలా రెండు నెలలు అమితానందంగా గడిచిపోయాయి.

ఓ శుభముహూర్తాన ఫోన్ బిల్లులు వచ్చాయి.

మామూలు ల్యాండ్ ఫోన్‌కి వచ్చే ఐదొందల బిల్లుతో పాటూ కొత్తగా తీసుకున్న సెల్‌ఫోన్లకి కాల్‌చార్జీలు వెయ్యి రూపాయలు, యాక్టివేషన్ చార్జీలు, ఇన్‌స్ట్రుమెంట్ రెంటు కలిపి ఏడొందల యాభై వచ్చాయి.

పీతాంబరం గుండె గుభేలుమంది.

వెంటనే ఆ సెల్‌ఫోన్ కంపెనీ ఏజెంటుకి ఫోన్ చేసి

దులిపేశాడు. "సెల్ నుంచి చేస్తే చవకన్నావు... ఇన్‌స్ట్రుమెంట్‌కి చార్జీ లేదన్నావు?" అంటూ.


"నేను చవకన్నది లోకల్ కాల్స్ కాదు సార్... ఐ.ఎస్.డి.కాల్స్, ఇన్‌స్ట్రుమెంట్ చార్జీ ఉండదన్నాను కానీ రెంటు ఉండదనలేదు" అంటూ చెప్పసాగాడు.

"నా బొంద... ఐ.ఎస్.డి. మాట్లాడ్డానికి మాకెవరున్నారు" విసుగ్గా అన్నాడు పీతాంబరం.

"అయినా మనలో మన మాట... ఇప్పుడు మిమ్మల్నెవరు బిల్లు కట్టమన్నారు సార్? ఒక నాలుగు నెలలు బిల్లు కట్టకుండా అలాగే పెండింగ్ పెడితే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద సగానికి పైగా తగ్గిస్తారు" అన్నాడు రహస్యం చెబుతున్నట్లు.

"ఏడిసినట్లుంది...నాకలాంటివి ఇష్టముండవు" అన్నాడు పీతాంబరం.

"అలాగైతే టారిఫ్ మార్చుతే వేరే ప్లాన్ తీసుకుందాం సార్.. దానికింకో రెండొందలవుతుంది...కానీ అదే చవక మీకు."



ఇంకా మాట్లాడితే కాల్ చార్జీ దండగని కట్ చేశాడు పీతాంబరం.

ఆ రోజు ఆఫీసు నుండి వస్తూ ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర స్కూటర్ ఆపాడు పీతాంబరం.

అంతలో సెల్‌ఫోన్ 'కుయ్ కుయ్'మంది.

ఫోన్ ఎత్తి హలో అన్నాడో లేదో, ట్రాఫిక్ సిగ్నల్ వదలడంతో వెనక వున్న వెహికల్స్ గోలగోలగా హారన్‌లు వాయించాయి.

అది చూసిన ట్రాఫిక్ కానిస్టేబుల్ గబగబా వచ్చి పీతాంబరాన్ని స్కూటర్‌తో సహా బరబరా పక్కకి లాక్కెళ్లిపోయాడు.

"ట్రాఫిక్‌లో సెల్‌ఫోన్ మాట్లాడకూడదని తెలీదా? వెయ్యి రూపాయలు ఫైన్ కట్టు" అన్నాడు.

పీతాంబరం బిత్తరపోయాడు. "ఇదెప్పటి నుంచి?" అన్నాడు.

"రోడ్ మీద వెళ్తూ సెల్‌ఫోన్ మాట్లాడేవాళ్ల వల్ల యాక్సిడెంట్స్ అవుతున్నాయని గవర్నమెంట్ కొత్తగా రూల్ పెట్టింది" అన్నాడు కానిస్టేబుల్.

అప్పటికే అందరూ చేరి పీతాంబరాన్ని వింతగా చూస్తున్నారు.

"ఈ సెల్‌ఫోన్లు మాట్లాడే వాళ్లు పక్కవాళ్ల డిస్టర్బెన్స్ గురించి పట్టించుకోరు. ఆఫీసుల్లో, పబ్లిక్ ప్లేసుల్లో, సినిమా హాళ్లల్లో కూడా సెల్‌ఫోన్ మాట్లాడే వాళ్లమీద ఫైన్ వేయాలి" ఎవరో అన్నారు.

"ఇది మరీ బావుంది... ఎక్కడ పడితే అక్కడ మనిష్టమొచ్చినట్లు మాట్లాడుకోవడానికి కాకపోతే ఇంక సెల్‌ఫోన్ కనిపెట్టిందెందుకు?" ఇంకెవరో అన్నారు.

"ఏదైనా మితిమీరితే ఇలాగే ఉంటుంది... అవకాశం ఉంది కదా అని అవసరమున్నా లేకపోయినా ప్రతీవాళ్లూ సెల్‌ఫోన్లు తీసేసుకుంటూంటే అంతే మరి..."

పీతాంబరానికి చెంపమీద ఛెళ్లున కొట్టినట్లయింది.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌కి ఫైన్ కట్టేసి, నేరుగా సెల్‌ఫోన్ ఏజెంటు దగ్గరకెళ్లి తన సెల్‌ఫోన్ వాపసు ఇచ్చేశాడు. రెండోది కూడా సరెండర్ చేసేస్తున్నానని, బిల్ సెటిల్ చేసుకుని ఇంటికొచ్చి ఇన్‌స్ట్రుమెంట్ తీసుకోమని చెప్పాడు.

* * *

"ఏమిటండీ? ఏమయింది? ఇందాకటినుంచీ ప్రయత్నిస్తున్నా మీ ఫోన్ కోసం...సెల్‌ఫోన్ ఆఫ్ చేసినట్లు మెసేజ్ వస్తోంది."

పీతాంబరానికి ఇంట్లోకి అడుగుపెడుతూండగానే ఎదురొచ్చి ఆదుర్దాగా అడిగింది వెంకటలక్ష్మి.

ఆమె అలా పలకరిస్తూంటే పీతాంబరానికి ఎంతో సంతోషంగా అనిపించింది...అవును మరి...వాళ్లిద్దరూ అలా మాట్లాడుకుని చాలా రోజులయింది!

ఇదివరకు రోజూ ఉదయం పీతాంబరం ఆఫీసుకెళ్లే వరకు ఏదో ఒకటి గడగడా మాట్లాడుతూనే ఉండేది వెంకటలక్ష్మి. అతనికి మతిమరుపని ఆరోజు చెయ్యాల్సిన పనులు ఒకటికి పదిసార్లు గుర్తు చేసేది.

సాయంత్రం ఇంటికి రాగానే 'లేటయిందేం' అంటూ ఆత్రంగా ఎదురొచ్చేది. ఆరోజు ఆఫీసులో జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్లు ఆమెకి చెప్పేవాడు.

ఈ సెల్‌ఫోన్లొచ్చాక అదంతా పోయింది.

ఎప్పటి విషయాలపుడే చెవుల్లో చేరిపోతున్నాయి... ఒకటికి పదిసార్లు గుర్తు చేయాల్సిన అవసరం అసలే లేదు..

అందుకే ఇంట్లో ఒకరితో ఒకరు మాట్లాడుకోవటమే మానేశారు. ఇలా ముఖాముఖి మాట్లాడుకుని ఎన్నాళ్లయిందో...పీతాంబరం ఆమెని కూర్చోబెట్టి జరిగిన సంగతంతా చెప్పుకొచ్చాడు. ఇద్దరూ టైమ్ మరిచిపోయి రెండు గంటలు అలాగే కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు.

ఆ కబుర్లలో మునిగిపోయిన వెంకటలక్ష్మికి అతను సెల్‌ఫోన్ సరెండర్ చేసేసన్నా పెద్దగా కోపం రాలేదు.

పీతాంబరానికి మాత్రం అప్పట్నుంచీ ఎవరి నోటివెంటైనా 'సెల్లుక్కొట్టు' అన్న మాట వింటే వాళ్లని పట్టుకుని చితక్కొట్టాలనిపిస్తోంది!!

## అండర్‌గ్రౌండ్‌లో అంత్రా

**కొన్ని చిత్రాల తర్వాత కొంతమంది తారలు చాలాకాలం పాటు కన్పించకుండా ఎక్కడికో వెళ్లిపోతుంటారు. ఈ పరిస్థితి కారణం ఏంటో వారినే అడగాలి. రాంగోపాల్‌వర్మ ఫేవరెట్ హీరోయిన్ అంత్రామాలి గురించి జనం అంతా అలాగే కామెంట్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే అంత్రా మాత్రం తానేమీ అండర్‌గ్రౌండ్‌లో లేనని, ఓ సినిమా స్క్రిప్ట్ కోసం మీడియాకి దూరంగా ఉంటున్నానంటోంది. ఈమె నటించబోయే చిత్రాన్ని నిర్మించేది మాత్రం వర్మ కార్పోరేషన్ అయి ఉంటుంది. కరెక్టేనా అంత్రా!**